VISION BHARATH REPORTER
విభారే
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం , 10-10-2023 సంపుటి : 06 సంచిక : 39 పేజీలు : 8 వెల : రూ 3-00



# వచ్చే మార్చి లేదా ఏప్రిల్‌లో ఏపీలో ఎన్నికలు: సీఎం జగన్

అమరావతి:(ా) వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కింది స్థాయిలో నేతలంతా కృషి చేయాలని వైకాపా శ్రేణులకు సీఎం జగన్ పిలుపునిచ్చారు. సాధారణ ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయడమే లక్ష్యంగా పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని వైకాపా నిర్వహించింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఈ సమావేశాలకు గ్రామస్థాయిలో సర్పంచులు, ఎంపీటీసీలు మినహా మిగిలిన అన్ని స్థాయిల్లో నేతలను ఆహ్వానించారు. పార్టీ అధ్యక్షుడి హోదాలో ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం జగన్.. వైకాపా ప్రజాప్రతినిధులను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు చేపట్టాల్సిన పలు కార్యక్రమాలను, పార్టీ నేతలు అనుసరించాల్సిన కార్యాచరణను ప్రకటించి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4 ప్రధాన కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్యసురక్ష, వైఏపీనీడ్ వైఎస్‌జగన్, బస్సు యాత్ర, ఆడుదాం ఆంధ్రా పేరిట కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నేతలు విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వచ్చే ఫిబ్రవరిలో పార్టీ మేనిఫెస్టోవిడుదలచేస్తామనివెల్లడించారు. వచ్చేమార్చిలేదా ఏప్రిల్‌లో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయన్నారు.

# మోగిన ఎన్నికల నగారా

**ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు**
**తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల**
**ఐదు రాష్ట్రాల్లో 8.2 కోట్ల మంది ఓటర్లు**
**తొలిసారిగా ఓటును వినియోగించుకోనున్న 60.2 లక్షల మంది ఓటర్లు**

న్యూఢిల్లీ,అక్టోబర్9 : తెలంగాణలో పాటు నాలుగు రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటిం చింది. దీంతో ఈ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్నామన్నారు. 40 రోజుల్లో ఐదు రాష్ట్రాల్లో పర్యటించాం. ఐదు రాష్ట్రాల అధికారులు, పార్టీల నేతలతో చర్చలు జరిపామని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయాలు తీసుకున్నా మన్నారు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం ఆరు నెలలు గా కసరత్తు చేస్తున్నాం అని తెలిపారు. తెలంగాణలో 119, ఛత్తీస్‌గఢ్‌లో 90, మిజోరాంలో 40, రాజస్థాన్‌లో 200, మధ్యప్రదేశ్‌లో 230 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈసీ పేర్కొన్నారు. మొత్తంలో ఐదు రాష్ట్రాల్లో 679 శాసనసభ




స్థానాలున్నాయని తెలిపారు. మిజోరాం శాసనసభ పదవీకాలం డిసెంబర్ 17, ఛత్తీస్‌గఢ్ జనవరి 3, మధ్యప్రదేశ్ జనవరి 8, రాజస్థాన్ జనవరి 14, తెలంగాణ శాసనసభ పదవీకాలం జనవరి 18 ముగియను న్నట్లు పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల్లో 8.2 కోట్ల మంది పురుష ఓటర్లు, 7.8 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇందులో 60.2 లక్షల మంది తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగిం చుకోనున్నారు.

# పిటిషన్లపై ఏసీబీ కోర్టులో సుదీర్ఘంగా విచారణ

**బెయిల్, కస్టడి పిటిషన్ డిస్మిస్ చేసిన ఏసీబీ కోర్టు**
**రెండు పిటిషన్లను కొట్టివేస్తూ ఏసీబీ కోర్టు తీర్పు**



అమరావతి,అక్టోబర్9 : టీడీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడికి ఏసీబీ కోర్టులో చుక్కెదురైంది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టు తీర్పును వెలువరించింది. బాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు కొట్టి వేసింది. అదే సమయంలో సీబీఐ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను సైతం కోర్టు కొట్టివేస్తూ తీర్పును ఇచ్చింది. రూ. 300 కోట్లకు పైగా స్కిల్ స్కామ్ వ్యవహారంలో అరెస్టైన చంద్రబాబు ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ లో ఉన్నారు. చంద్రబాబు, సీఐడీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై ఏసీబీ కోర్టులో సుదీర్ఘంగా విచారణ జరిగింది. రెండు పిటిషన్లను కొట్టివేస్తూ నేడు ఏసీబీ కోర్టు తీర్పును వెల్లడించింది. ఇదిలా ఉండగా.. ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్, అంగుళ్ల కేసు వ్యవహారంలో బాబు దాఖలు చేసిన ముందస్తు (మిగతా 7 లో )

# ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ సన్నద్ధం




**ఈ నెల 15న బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల!**
**అభ్యర్థుల సమక్షంలో ఎన్నికల మేనిఫెస్టో**
**అభ్యర్థులకు బీ ఫారాలను అందజేసే అవకాశం**
**అన్ని వర్గాలను ఆకర్షించేలా పలు హామీలు ఉండే అవకాశం**
**15 నుంచి కేసీఆర్ జిల్లాల పర్యటన ప్రారంభం**
**16న జనగామ, భువనగిరిలో బహిరంగ సభలు**
**17న సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో సభలు**
**ప్రతిపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధించనున్న గులాబీ బాస్**

# పలువురు నాయకులను కలిసిన వీరులపాడు మండల - జడ్పిటిసి





ఈరోజు 09 - 10 - 2023 న వీరులపాడు మండల జడ్పిటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య పార్లమెంట్ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ని మరియు శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించడం జరిగినది. అదేవిధంగా వీరులపాడు మండలంలోని జడ్పీ నిధుల ద్వారా జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సైతం వివరించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు శాసనమండలి సభ్యులు వీరు ఈ విధంగా అనేక మరిన్ని అభివృద్ధి పనులు జరిపించాలని అభినందనలు తెలియజేశారు

# నవంబర్ 30న పోలింగ్

**నవంబర్ 10వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ**
**నామినేషన్ల ఉపసంహరణ 15**
**డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు**



న్యూఢిల్లీ,అక్టోబర్9( : రాష్ట్ర శాసనసభకు నవంబర్ 30వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో ఈ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. నవంబర్ 10వ తేదీ నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. 13న స్క్రూట్నీ నిర్వహించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ నవంబర్ 15. నవంబర్ 30వ తేదీన ఎన్నికలు నిర్వహించి, డిసెంబర్ 3న కౌంటింగ్ చేయనున్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాలకు ఒకే విడుతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణలో 35,356 పోలింగ్ కేంద్రాల ఏర్పాటురాష్ట్రంలో ఎన్నికల నగారా మోగింది. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్‌ను సీఈసీ రాజీవ్ కుమార్ ప్రకటించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో 35,356 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో 14,464 కేంద్రాలు పట్టణ ప్రాంతాల్లో ఉండగా, చెప్పారు. సగటున ప్రతి పోలింగ్ కేంద్రంలో 897 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. 27,798 కేంద్రాల్లో (78 శాతం) వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

# వైఎస్సార్ జిల్లాలో రోడ్డు ప్రమాదం..

**నలుగురు మృతి**




ఎర్రగుంట్ల: ( వైఎస్సార్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మృత్యువాతపడ్డారు. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి సమీపంలో ఆర్టీసీ బస్సు - ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, ఎర్రగుంట్ల తహసీల్దార్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రొద్దుటూరు, కడపకు చెందిన 11 మంది.. ప్రొద్దుటూరు నుంచి మల్లెలకు ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆటో లారీని క్రాస్ చేయబోతుండగా.. ఎర్రగుంట్ల నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళా డ్రైవర్‌తో సహా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మృతి చెందారు. మృతులను మహమ్మద్ (25), హసీనా (25), అమినా(20), షాకీర్(10)లుగా గుర్తించారు.

# ల్యాండ్.. శాండ్.. వైన్.. మైన మాఫియాలకే జగన్ కావాలి.. పేదలకు కాదు: అచ్చెన్నాయుడు

అమరావతి: పేదలను విస్మరించిన జగన్‌కి.. రాష్ట్ర ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. అబద్ధాలు ఆడటం సీఎం జగన్‌కు బాగా అలవాటు అయిందన్నారు. రాష్ట్రంలోని పేదల పట్ల సీఎం జగన్ కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. జగన్‌కు పేదలపై ఉన్న ప్రేమ నిజమైతే.. వారి కోసం తెదేపా తీసుకొచ్చిన 120 పథకాలను ఎందుకు రద్దు చేశారని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సబ్ ప్లాన్ నిధులు రూ. 1.14 లక్షల కోట్లను ఎందుకు మళ్లించారంటూ ప్రశ్నించారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడిన అచ్చెన్న.. రాష్ట్ర ప్రజల పట్ల జగన్ తీరుపై విమర్శలు గుప్పించారు."నాసిరకమైన మద్యంతో 20వేల మంది పేదల ప్రాణాలు తీశారు. అన్న క్యాంటీన్లను రద్దు చేసి పేదల పొట్టకొట్టారు. పెళ్లి కానుకలు, సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలు రద్దు చేశారు. 2018-19లో సంక్షేమానికి తెదేపా 18.21 శాతం ఖర్చు చేస్తే.. 2022-23లో జగన్ సర్కారు 16.20 శాతం మాత్రమే ఖర్చు చేశారు.



# సంపాదకీయం

మంగళవారం , 10-10-2023

## చాట్ జీపీటీ కంటే విద్యార్థులే నయం...

ఇప్పుడు ప్రపంచం అంతా చాట్ జీపీటీ (చాట్ జనరేటివ్ ప్రీ-ట్రైన్డ్ ట్రాన్స్ ఫార్మర్)పైనే చర్చ జరుగుతోంది. దీనిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతోంది. ఎంతో మంది చాట్ జీపీటీపైనే ఆధారపడుతున్నారు. ఏఐతో ఎన్నో అద్భుతాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ చాట్ బోట్ మనిషి చేసే చాలా పనులను చేస్తుంది. అందుకే పలు కంపెనీలు ఏఐతో పనులు చేస్తూ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. అయితే, ఇది అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని, దీని ఉపయోగం పెరిగేకొద్దీ అదే స్థాయిలో ఉద్యోగాల సంఖ్య తగ్గిపోతుందని అత్యధిక మంది భయం వ్యక్తం చేస్తున్నారు. అయితే, చాట్ జీపీటీ వల్ల ఆశించినంత ప్రయోజనం లేదని, ఈ ఓపెన్ ఏఐను స్థాపించిన సంస్థ (అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ లేబరేటరీ) సంక్షోభంలో ఉందని, అది వచ్చే ఏడాదికి దివాలా తీస్తుందని మరికొందరు అంటున్నారు. ఈ రెండు వాదనలు సరైనవి కావు. ఏఐ వల్ల కొంత ప్రయోజనం ఉన్నమాట నిజమే. అయితే, దాని వల్ల ఉద్యోగాలు భారీ స్థాయిలో కోల్పోయే మాట వాస్తవం కాదు. దీనివల్ల కొన్ని లాభాలు ఉన్నాయి. అలాగే, నష్టాలు కూడా ఉన్నాయి. చాట్ జీపీటీ, ఇది గూగుల్‌కు ప్రత్యామ్నాయంగా అభివృద్ధిపరిచినట్లుగా భావించవచ్చు. ఉదాహరణకు మనకు ఏదైనా ఒక అంశానికి సంబంధించిన సమాచారం కావాలంటే గూగుల్‌లో సెర్చ్ చేస్తే, దానికి సంబంధించి వివిధ వెబ్ సైట్లలో ఉండే సమాచారం చూపుతుంది. వాటిలో నుంచి మనకు కావలసిన సమాచారం తీసుకోవాలి. చాట్ జీపీటీలో అయితే, మనకు కావలసిన అంశానికి సంబంధించిన సమాచారం గుత్తగా ఒకేచోట లభిస్తుంది. ఉదాహరణకు హైదరాబాద్ లేక అమరావతి అని ఎంటర్ చేస్తే, గూగుల్‌లో వాటికి సంబంధించిన చాలా రకాల సమాచారం వస్తుంది. చాట్ జీపీటీలో అయితే, హైదరాబాద్ లేక అమరావతి సమాచారం ఒకేచోట లభిస్తుంది. ఆ సౌలభ్యం ఇందులో ఉంది. ఇందులో అపారమైన సమాచారం ఉంటుంది. టెక్ట్స్ రూపంలో ఏ ప్రశ్న అడిగినా టెక్ట్స్ రూపంలో సమాధానం ఇస్తుంది. అయితే, ఇందులో ఈ సమాచారం మ్యాజిక్ ద్వారా ఏమీ రాదు. దానిని ఉద్యోగులే సేకరించి, ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తుంటారు. అయినా, ఆ సమాచారంలో చాలా లోపాలు ఉంటుంటాయి. ఆ లోపాలను ఉద్యోగులే సరిదిద్దాలి. అందువల్ల కొన్నిచోట్ల ఉద్యోగాలు పోతే, మరికొన్నిచోట్ల కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. ఇందుకు సంబంధించి పరిశోధనా ఫలితాలను పరిశీలిద్దాం. అకౌంటింగ్ పరీక్షలో చాట్ జీపీటీ కంటే విద్యార్థులే మెరుగైన ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల సరాసరి స్కోర్ 76.7 శాతం ఉండగా, చాట్ జీపీటీ స్కోర్ 47.4 శాతం మాత్రమే ఉంది. అమెరికాలో బ్రింగ్‌హ్యామ్ యంగ్ యూనివర్సిటీ(బీవైయూ)తోపాటు మరో 186 ఇతర యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు అకౌంటింగ్ పరీక్షల్లో చాట్‌జీపీటీ ఎలా పని చేస్తుందో విస్తృత స్థాయిలో పరిశీలించారు. వారు తెలుసుకున్న విషయాలను అకౌంటింగ్ ఎడ్యుకేషన్ జర్నల్‌లో ప్రచురించారు. చాట్ జీపీటీ కంటే విద్యార్థులే తెలివైనవారని తేల్చారు. అయితే 11.3 శాతం ప్రశ్నల విషయంలో చాట్ జీపీటీ స్కోర్ మెరుగ్గా ఉందని తేలింది. అకౌంటింగ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఆడిటింగ్‌లో ఫలితాలు మెరుగ్గా ఉన్నాయి. ట్యాక్స్, ఫైనాన్షియల్, మేనేజరియల్ అసెస్‌మెంట్‌లో ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయి. మేథమెటికల్ ప్రక్రియల్లో ఇబ్బందులు ఎదురైనట్లు గమనించారు. చాట్ జీపీటీ వేదిక ఓపెన్ ఏఐ అతి త్వరలోనే ఆర్థిక సంక్షోభంలోకి జారుకోనుందని అనలిటిక్స్ ఇండియా సర్వే పేర్కొంది. 2024 చివరికి ఆ కంపెనీ దివాలా తీయవచ్చని అనలిటిక్స్ ఇండియా మేగజైన్ తన నివేదికలో వెల్లడించింది. ఈ ఓపెన్ ఏఐ సంస్థను సామ్ ఆల్ట్‌మన్ 2022 నవంబర్‌లో స్థాపించారు. జీపీటీ -3.5, జీపీటీ-4 వాడుకునేందుకు డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ ఆ సంస్థ సరిపడా ఆదాయం సమకూర్చుకోలేకపోతోంది. ఇప్పట్లో బ్రేక్ ఈవెన్ రావడం కష్టమేనని నిపుణులు అంటున్నారు. ఓపెన్ ఏఐని నడిపించేందుకు ప్రతి రోజూ 7 లక్షల డాలర్లు (రూ.5.8 కోట్లు) ఖర్చవుతోందని అంచనా. ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడం లేదు. మొదట్లో దీనిని అత్యధికమంది ఉపయోగించేవారు. క్రమంగా వారి సంఖ్య తగ్గుతోంది. జూన్‌లో 170 కోట్ల మంది చాట్ జీపీటీని ఉపయోగించుకోగా, జులై నాటికి వారి సంఖ్య 150 కోట్లకు తగ్గింది. అంటే 12 శాతం పడిపోయింది. దాంతో సంస్థ నష్టాల్లో ఉంది. అయితే, 2023 చివరికి 200 మిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని ఓపెన్ ఏఐ అంచనా వేస్తోంది. 2024 నాటికి బిలియన్ డాలర్ కంపెనీగా అవతరిస్తుందని పేర్కొంది. వినియోగదారుల సంఖ్యను పెంచుకునేందుకు ఓపెన్ ఏఐ సంస్థ తాజాగా చాట్ జీపీటీ-4 అప్ డేట్ వెర్షన్‌ను తీసుకొచ్చింది. ఇది దాదాపు మనిషిలాగే పనిచేస్తుందని సంస్థ తెలిపింది. ఈ కొత్త వెర్షన్ మరింత సురక్షితంగా ఉంటుందని ఓపెన్ ఏఐ తన బ్లాగ్‌లో పేర్కొంది. క్లిష్టమైన ప్రశ్నలు, సమస్యలకు కూడా కచ్చితమైన సమాధానాలు ఇస్తుందని ఓపెన్ ఏఐ తెలిపింది. భవిష్యత్‌లో ఇమేజ్‌ల రూపంలో ప్రశ్నలు అడిగినా సమాధానాలు చెప్పేలా చాట్ జీపీటీ 4ను రూపొందించారు. చివరకు ఉద్యోగులే దాని కచ్చితత్వాన్ని పరిశీలించవలసి ఉంటుంది.

# ప్రతి పేదవాడికి మెరుగైన ఆరోగ్యాన్ని అందించండి

## ఐటీ సెక్రటరీ మరియు జిల్లా స్పెషల్ అధికారి కోన శశిధర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 09 :-ప్రతి పేదవాడికి రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యాన్ని అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన లక్ష్యమని ఐటీ సెక్రటరీ మరియు జిల్లా స్పెషల్ అధికారి కోన శశిధర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లాలో వెలుగోడు, నంద్యాల పట్టణంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణ పనితీరుపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై సంబంధిత మెడికల్ అధికారులు, నియోజకవర్గ స్పెషల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారుఈ సందర్భంగా ఐటీ సెక్రటరీ మరియు జిల్లా స్పెషల్ అధికారి కోన శశిధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని... ఈ మేరకు ప్రతి పేదవాడికి రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యాన్ని అందించాలన్నారు. వైద్య శిబిరాల్లో గుర్తించిన రోగులకు వైద్య పరీక్షల నిర్వహణ నామకేవాస్తి చేశామన్న రీతిలో కాకుండా మెరుగైన పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించాలన్నారు. శిబిరాల్లో పెద్ద వ్యాధులకు గురైన బాధితులను రెఫెరల్ ఆస్పత్రులకు పంపడమే కాకుండా వాటిని ఫాలో అప్ చేసే బాధ్యతను డాక్టర్లు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలకు స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అర్బన్, మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో అధిక స్థాయిలో క్యాంపులు నిర్వహించడంతోపాటు నిపుణులైన వైద్యులను కూడా క్యాంపులకు రప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్వోను ఆదేశించారు. ఇళ్లకు తాళం వేసిన కుటుంబీకులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలకు అధిక సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టు శిబిరాల్లో ఫ్యాన్లు, త్రాగునీటి సదుపాయం ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే శిబిరాల సమీపంలో 108 అంబులెన్స్ వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. శిబిరాల్లో రోగులకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు టెస్టులకు అవసరమైన కిట్లను సిద్ధంగా ఉంచుకోవాలని డాక్టర్లను సూచించారు. కంటి వెలుగు కింద కాంటాక్ట్ ఆపరేషన్లు చేయడానికి చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయాలన్నారు. వైద్య శిబిరాల్లో గుర్తించిన లోపాలను సవరించుకుంటూ భవిష్యత్తులో ఎలాంటి లోపాలు లేకుండా సరి చూసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వైద్య శిబిరాల్లో చేస్తున్న ఏర్పాట్ల గురించి వివరిం చారు. ఇప్పటివరకు గ్రామీణ ప్రాం తాలలో 128, అర్బన్ ప్రాంతాలలో 7 వైద్య శిబిరాలు నిర్వహించమ న్నారు. ఈ వైద్య శిబిరాల్లో 58,000 మంది ఓపి నమోదైనట్లు వివరిం చారు. ఇందులో దీర్ఘకాలిక రోగుల ను రెఫెరల్ హాస్పిటల్ కు పంపిస్తు న్నట్లు తెలిపారు. 15 రోజులు ముందే ఇంటింటి సర్వే నిర్వహించి సంబంధిత రోగుల డేటాను సేకరించి సంబంధిత రోగులను వైద్య శిబిరాలకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించుకోవడంతో పాటు అవసరమైన అన్ని మందులు సిద్ధంగా ఉంచుకున్నామని వివరిం చారు.×అంతకుముందు వెలుగోడు, నంద్యాల పట్టణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను పరిశీలించి పరిశీలించారు. గుర్తించిన జబ్బులకు కేస్ షీట్ లను పరిశీలించడంతోపాటు అన్ని కౌంటర్లను తనిఖీ చేస్తూ డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డా.జఫరూళ్ళ, డిఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, అన్ని నియోజ కవర్గాల స్పెషల్ మెడికల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.×

# 15 వ తేది ఆదివారం పాడ్యమి నుండి శరన్నవరాత్రి మహోత్సవములు.



కర్నూలు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 విభారె న్యూస్.ఓం సర్వమంగళ మాంగల్యే శివేసర్వార్థ సాధికే శరణ్య త్ర్యంబకే గౌరి నారాయణీ నమోస్తుతే 15-10-2023 ఆదివారం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు 24-10-2023 మంగళవారం విజయదశమి పర్యంతము మన కర్నూలు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ మహాగౌరీ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవములు శ్రీ విద్యా సంప్రదాయానుసారం విశేషముగా నిర్వహించబడును. ఈ పది రోజులు అమ్మవారికి ప్రాతఃకాలంలో అభిషేకము, విశేష అర్చనలు, శ్రీ లలితా సహస్రనామార్చనలు జరుగును. తిరిగి రాత్రికాలము షోడషోపచార పూజ, సహస్రనామార్చన , ప్రతి రోజు ఒక విశేష ద్రవ్యముచే అర్చన మహా మంగళ హారతులు జరుపబడును. ప్రతి రోజు లఘు శ్రీచక్ర పూజ పాదుకానుష్టాన పూజలు జరుగును. విశేష దినములయందు కుమారీపూజ, సువాసినీ పూజ, ప్రతిరోజు చండీహోమాది కార్యక్రములు నిర్వహించబడును. శరత్కాలము నందు చేసే అమ్మవారి జపం, అర్చనలు, హోమాలు విశేషమైన ఫలితములు ఇవ్వగలవు. ఈ నవరాత్రులలో చేసే దేవీ అనుష్ఠానము ఉపాసనలు పూజలవలన సమస్తమైన దారిద్ర్య, దుఃఖ, భయాదులు, శతృ, రుణ, రోగ బాధలు తొలిగిపోయి. ఆయురారోగ్య ఐశ్వర్య భోగభాగ్యాలు లభించగలవు. అమ్మవారి దయవలన ఇహ పర సౌఖ్యాలు సిద్ధించగలవు. 10 రోజుల అమ్మవారి అలంకరణ మరియూ విశేష పూజలు 15-10-2023 ఆదివారం (మహాగౌరీ) వక్కలతో అర్చన16-10-2023 సోమవారం (బాలాత్రిపురసుందరి) పసుపు కొమ్ములతో అర్చన17-10-2023 మంగళవారం (అన్నపూర్ణాదేవి) గాజులతో అర్చన18-10-2023 బుధవారం (గాయత్రి దేవీ) కొబ్బరికాయలతో అర్చన 19-10-2023 గురువారం (మహాలక్ష్మి) ధనలక్ష్మీ పూజ20-10-2023 శుక్రవారం (మహా సరస్వతి అలంకారం ) సరస్వతి పూజ 21-10-2023 శనివారం (శ్రీ లలిత మహా త్రిపుర సుందరి ) కుమారీపూజ22-10-2023 ఆదివారం (మహాదుర్గ) నిమ్మకాయలతో అర్చన సువాసిని పూజ 23-10-2023 సోమవారం మహా పూర్ణాహుతి (మహిషాసురమర్ధిని) తమలపాకులతో అర్చన24-10-2023 మంగళవారం (శ్రీ రాజరాజేశ్వరి) కుంకుమార్చన పుష్పార్చన శమీపూజ25-10-2023 బుధవారం నవరాత్రుల ముగింపు సందర్భంగా కలశ ఉద్వాసన, అష్టోత్తర శత కలశాభిషేకం (108 కలశములతో అమ్మవారికి అభిషేకం, పూజ కుంకుమ వితరణ)ఈ 10 రోజుల పూజకు 300/-నవ చండి హోమంఒక రోజు చండి హోమం 2500/-9 రోజులకు చండి హోమ సంకల్పం 516/- ప్రతి రోజు కార్యక్రమ వివరములు సమయం ఉదయం 9 గం నుండి 10 గం వరకు లలిత సహస్ర నామార్చన ఉదయం 10 :30 గం నుండి 12:30 చండి హోమం తిరిగి సాయంత్రం 6 గం నుండి 8 గం వరకు సహస్ర నామార్చన విశేష పూజలు సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ. 8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్.8896123777.

# ఎమ్మెల్యేకు ఆళ్లగడ్డ నియోజకవర్గ సమస్యలు కనబడడం లేదా..?



మాట్లాడుతున్న భూమా కిషోర్ రెడ్డి

ఆళ్లగడ ప్రతినిధి అక్టోబర్ 09 విభారె న్యూస్ :- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజల వద్దకు వెళుతున్న ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డికి సమస్యలు కళ్ళముందు ఉన్న కనపడడం లేదా అని తాలూకా బిజెపి బాధ్యతలు భూమా కిషోర్ రెడ్డి ప్రశ్నించారు. ఆయన తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రెండు నెలలుగా పల్లెనిద్ర కార్యక్రమంతో ప్రజలతో మమేకమవుతున్నారని తనను ఆదరిస్తున్న నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. గడపగడపకు వెళ్తున్న ఎమ్మెల్యేకు ఆ గ్రామంలోని సమస్యలు కనబడడం లేదా అని కిషోర్ రెడ్డి ప్రశ్నించారు. మద్దూరు లాంటి గ్రామాలలో విష జ్వరాలు ప్రభలుతున్నాయని కొన్ని గ్రామాలలోని ఎస్సీ కాలనీలలో రోడ్లు బురదతో కూరుకుని పోయాయన్నారు. ఆళ్లగడ్డ పర్యటనకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 100 కోట్లు నిధులు మంజూరు చేశారని ఆ నిధులతో పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రతి సచివాలయానికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని కానీ ఆ నిధులతో ఏ పనులు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సిసి రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆళ్లగడ్డ అప్రోచ్ రోడ్డు వెయ్యలేదని ఆయన ఇంటి రోడ్డు తప్ప ఏది వేయలేదని ఆరోపించారు. ఆయన ఎమ్మెల్యే అయ్యాక మహదేవపురం చాగలమర్రి రోడ్డు తప్ప ఏది పూర్తి చేయలేకపోయారన్నారు. అది గత టిడిపి హయాంలో అప్పటి ఎమ్మెల్యే కమిషన్ల కోసం కక్కుర్తి పడి ఆపివేయడం జరిగిందని ఆయన ఆరోపించారు. అలాగే హాస్పిటల్ గత టిడిపి హయాంలోనే మంజూరు అయిందని, కమిషన్ల కోసమే తెదేపా వారు నిలిపివేయడం జరిగింది అన్నారు. అప్పుడు మంజూరైన వాటిని నీవు పూర్తి చేయడం జరిగిందని, ప్రత్యేకంగా నీవు మంజూరు చేయించింది ఏమీ లేదన్నారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలు కరువైయ్యాయన్నారు. ఒకవైపు మీదందా, మరోవైపు మాజీ మంత్రి దందా తో ఆళ్లగడ్డ ప్రజలు బెంబేలు ఎత్తుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మీ డిపాజిట్లు గల్లంతవుతాయన్నారు. వై నాట్ 175 అంటున్న మీకు ప్రజలకు ఏమి చేశారని ఓటు వేయాలని ప్రశ్నించారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి సచివాలయానికి వెళ్తానని, ఆ సచివాలయంలో సమస్యలను మీ దృష్టికి తెస్తామని, ఇప్పటినుండి అయినా వాటిని పరిష్కరించాలని భూమా కిషోర్ రెడ్డి హితవు పలికారు.





# శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానానికి వెండి వస్తువుల బహుకరణ.

## - నెల్లూరు వాసులు పాలా పెంచలయ్య వారిచే అందజేత....

శ్రీశైలం అక్టోబర్ 9 విభారె న్యూస్.సోమవారం పాలా పెంచలయ్య,నెల్లూరు వారు పలు వెండి వస్తువులను దేవస్థానానికి సమర్పించారు.రెండు వెండి ఉద్ధరిణలు, అయిదు వెండి గిన్నెలు, రెండు తీర్థపు గిన్నెలు, మూడు వెండి ప్లేట్లు వీరు సమర్పించడం జరిగింది.. అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు ఈ వెండి వస్తువులను పర్యవేక్షకులు స్వాములకు అందజేశారు.ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ వీటి విలువ మొత్తం రూ.2,32,901/- లు అని తెలిపారు.ఈ సమర్పణ అనంతరం దాతలకు వేదాశీర్వచనం చేసి శ్రీస్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను ప్రసాదాలను అందజేయడం జరిగింది.

# కలెక్టర్ స్పందన కు 184 ఫిర్యాదులు

### ఇంచార్జి కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 09 :-జగనన్నకు చెబుదాం స్పందన విజ్ఞప్తులపై వెంటనే స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందేస్థాయిలో పరిష్కరించాలని ఇంచార్జి కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.× ఈ సందర్భంగా జిల్లాఇంచార్జి కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందేస్థాయిలో నిర్దేశిత గడువులోగా వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను సూచించారు. స్పందన కార్యక్రమాన్ని ప్రాధాన్యతగా తీసుకొని లబ్జిదారుల సమస్యలను



పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను సూచించారు. పెద్ద ఎత్తున చేస్తున్న ఈ కార్యక్రమంలో ఫలితాలు కనపడాలని ఆయన సూచించారు. నిబంధనల మేరకు అర్జీదారుల సమస్యలను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు గ్రీవెన్స్ పరిష్కరించే అధికారి లాగిన్ లో వచ్చిన దరఖాస్తులను ఏరోజుకారోజు 24 గంటల్లో సమ్మతి అధికారికి చర్య నిమిత్తం అసైన్ చేయడంలో అశ్రద్ధ వహించిన డేటా ఆపరేటర్లను షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఇన్చార్జి కలెక్టర్ ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని వినతులు రుద్రవరం మండలం పేరూరు గ్రామ కాపురస్తురాలు ఎల్లమ్మ తనకు గ్రామంలో సర్వే నంబర్ 757/3 లో 3.50 ఏకరాల భూమి ఉందని దానిని నాగిరెడ్డి పల్లెకు చెందిన ఒక వ్యక్తికి కౌలుకు ఇచ్చిందని... కాని అతను ఆ భూని దౌర్జన్యంగా పూర్తిగా ఆక్రమించుకున్నాడని... ఆన్లైన్లో మరియు పట్టాదారు కాగితాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి వారికి దరఖాస్తును సమర్పించుకున్నారు.×ఇంకా ఈ కార్యక్రమంలో 184 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, అన్ని శాఖల జిల్లాధికారులు పాల్గొని అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు

## వలసలు ఆగాలి.. ఉద్యోగాలు కావాలి..

### యువగర్జన దీక్షలో పాల్గొన్న జనసేన నాయకులు



ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 09 విభారె న్యూస్ :- ఆంధ్రప్రదేశ్లో వలసలు ఆపడంలో ప్రభుత్వం విఫలమైందని యువతకు ఉద్యోగాలు కావాలని జనసేన నాయకులు మాబు హుస్సేన్, పడిగపాడు శ్రీరాములు, బావికాడి గుర్రప్ప ఆధ్వర్యంలో యువగర్జన నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమలో వలసలు వెళ్తున్నారని వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పట్టబద్రులైన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని వెంటనే ఉద్యోగ ఉపాధి కల్పన చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు చేపట్టకపోతే జనసేన తరపున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ దీక్షలో సజ్జల నాగేంద్ర, దూదేకుల బాబు, రంగస్వామి, చలివెందుల రాజారాం, డేవిడ్, సుబ్బయ్య, దౌలాభాయ్, రామంజి, రఫీ, చైతన్య, హుస్సేన్, మంగమ్మగారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ కులాయి ఏర్పాటుకు వినతి



ఎమ్మిగనూరు టౌన్, అక్టోబర్ 9 విభారె న్యూస్:-పబ్లిక్ కులాయి ఏర్పాటు చేయాలని లక్ష్మీపేట వాసులు మాజీ కౌన్సిలర్ రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందించారు. స్థానిక మాచాని సోమప్ప పాఠశాల వెనక ఉన్న తమకు కాలనీలో మంచినీటి కులాయి లేనందున వేరే ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని తమ బాధను కమిషనర్ కు విన్నవించుకోగా, ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఆ ప్రాంతంలో పబ్లిక్ కులాయి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీవాసులు కమిషనర్ కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## డెంగ్యూ కేసులు నమోదు కావడంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్న వైద్య అధికారులు



గోనెగండ్ల అక్టోబర్ 09 :-విభారే న్యూస్ ప్రతినిధి :-×గోనెగండ్ల మండల కేంద్రంలో మెట్ట వీధిలో డెంగ్యూ కేసులో నమోదు అవుతున్నాయని పత్తికొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా మీడియాకు తెలియజేశారు. దోమల నివారణ కొరకు పిరిత్రియం అబిట్ పిచికారి వీధిలో చేయించారు. పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామీణులకు తెలియజేసినట్లు సాయిబాబా తెలిపారు. ఎం. పి. హెచ్ .ఈ .ఓ హనుమంతు పి .హెచ్ .సి సిబ్బంది పాల్గొన్నారు.

## విమర్శలు మాని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి




ఎమ్మిగనూరుటౌన్ అక్టోబర్ 9 విభారె న్యూస్:-జనసేన నేత పవన్ కళ్యాణ్ పై విమర్శలు మాని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని చేనేత వికాస్ రాష్ట్ర కార్యదర్శి రవి ప్రకాష్ హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంచేపట్టగానేఏఒక్కహామీ నెరవేర్చలేదని విమర్శించారు .కేవలం ప్రతిపక్షాలను విమర్శించడంలోనే పాలన కాలం గడిచిపోయిందని, ఇకనైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. జనసేన పార్టీకి నాయకులు, కార్యకర్తలు ఉన్నారో లేదో రాబోయే 2024 ఎన్నికల్లో తెలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు కర్ణం రవి, రాహుల్ సాగర్, షబ్బీర్, నాగరాజ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పిటిషన్లపై ఏసీబీ కోర్టులో సుదీర్ఘంగా విచారణ

(మొదటి పేజీ తరువాయి)

బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టి వేసింది. అయితే, ఏసీబీ కోర్టు గతవారమే ఈ రెండు పిటిషన్లపై విచారణ పూర్తి చేసి తీర్పును మాత్రం రిజర్వ్ చేసింది. దీనిపై ఇవాళ తీర్పు వెలువరించిన ఏసీబీ కోర్టు.. రెండు పిటిషన్లను డిస్మిస్ చేసింది. అదే సమయంలో సుప్రీంకోర్టులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై కీలక వాదనలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించగా.. సీఐడీ తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఫైబర్‌నెట్‌లో అక్రమాలు జరిగాయంటూ చంద్రబాబు నాయుడుపై సీఐడీ కేసు నమోదు చేసింది. దీనిపై చంద్రబాబు నాయుడు హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపించగా.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్ వాదించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలకు చంద్రబాబుని బాధ్యుడిని చేయడం సరికాదని, రాజకీయ కక్షతో మాత్రమే కేసు నమోదు చేశారని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. రెండేళ్ల క్రితం కేసుపెట్టి చంద్రబాబుకు నోటీసులు ఇవ్వలేదని, ఇప్పుడు ఒక్కసారిగా ఆయన పేరును చేర్చారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ప్రాథమిక విచారణలో చంద్రబాబు పేరు లేదు కాబట్టి కేసులో ఆయన లేరనడం సరికాదని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేశాక చంద్రబాబు ప్రమేయాన్ని గుర్తించినట్లు కోర్టుకు తెలిపారు. ఇరు వైపుల వాదనలు అనంతరం తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు.. తాజాగా ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది.మరోవైపు అంగళ్లు ఘటనలో పోలీసులు నమోదు చేసిన కేసులో చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరిట ఆగస్టు 4వ తేదీన అన్నమయ్య జిల్లాలో చంద్రబాబు పర్యటించారు. ఆ సమయంలో అంగళ్లు మీదుగా ఆయన వెళుతున్నప్పుడు వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడడం, టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సహా ఆ పార్టీకి చెందిన మొత్తం 179 మంది నేతలపై కురబలకోట మండలం ముదివేడు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.చంద్రబాబు స్కిల్ డెవలప్మెంట్ కేసు విచారణ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్, సీఐడీ కస్టడీ పిటిషన్లను విచారించిన విజయవాడ ఏసీబీ కోర్టు.. రెండు పిటిషన్లనూ కొట్టివేసింది.

## కూటమిపై అంతా అయోమయం...

గుంటూరు, అక్టోబరు 9, జనసేన అధినేత పవన్ కల్యాణ్ బీజేపీ విషయంలో చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా గందరగోళానికి దారి తీస్తున్నాయి. ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి మరీ టీడీపీకి మద్దతు ఇచ్చానని ఆయన ప్రకటించడంతో జాతీయ మీడియా కూడా ఎన్డీఏ నుంచి మరో పార్టీ బయటకు వెళ్లిపోయిందని ప్రచారం చేసింది. అయితే? పవన్ కల్యాణ్ తర్వాతి రోజే ఖండించారు. తాను ఎన్డీఏలోనే ఉన్నానని.. తాను బయటకు వెళ్తే అందరికీ చెబుతానన్నారు. బీజేపీ తమతో కలిసి వస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. బీజేపీతో కలిసే ఉన్నానని అంతిమంగా ఆయన చెబుతున్నారు. కానీ టీడీపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామంటున్నారు. అక్కడే క్లారిటీ మిస్ అవుతోంది. పవన్ కల్యాణ్ బీజేపీతో కలిసి పోటీ చేస్తే ఓట్లు వస్తాయి కానీ సీట్లు రావని అన్నారు. టీడీపీతో కలిసి పోటీ చేస్తే తిరుగు ఉండదని నమ్ముతున్నారు. అదే విషయాన్ని చెబుతున్నారు. టీడీపీతో పోటీ చేయడం ఖాయమని.. సమన్వయ కమిటీని కూడా నియమించుకుంటున్నామన్నారు. బీజేపీతో ఎలాంటి అంశాలు చర్చించకుండా చంద్రబాబుతో ములాఖత్ అయిన తర్వాత పొత్తు విషయం ప్రకటించారు. దీంతో బీజేపీతో జనసేన మైత్రి ముగిసిపోయిందని అంతా అనుకున్నారు. అయితే బీజేపీ కూడా కలిసి వస్తుందని నమ్ముతున్నానని ఆయన పదే పదే చెబుతున్నారు . అసలు బీజేపీ ప్రస్తావన తీసుకు రావాల్సిన అవసరం ఏమిటన్నది మాత్రం రాజకీయవర్గాలకు అంతు చిక్కకుండా ఉంది. ఏపీ రాజకీయాలపై బీజేపీ హైకమాండ్ పట్టించుకునే తీరిక లేకుండా పోయింది. ఇటీవలి కాలంలో ఒక్క అగ్రనేత కూడా ఏపీలో పర్యటించలేదు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఏపీలో అమిత్ షాతో పాటు జేపీ నడ్డా చెరో సభను ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్‌సీపీని విమర్శించారు. అదే రాజకీయం. జనసేనతో కలిసి ఉన్నారో లేదో వారు చెప్పలేదు. జనసేనను పిలవలేదు. మళ్లీ ఏపీ గురించి పట్టించుకోలేదు. ఎన్డీఏ మీటింగ్ కు పవన్ ను ఆహ్వానించారు. ఆయన వెళ్లి వచ్చారు. తాను చెప్పాలనుకున్నది చెప్పానని ఆయన అంటున్నారు. కానీ బీజేపీ హైకమాండ్ ఇక్కడ రాష్ట్ర నేతలకూ సమాచారం ఇవ్వకపోవడంతో ఎలాంటి విధానాన్ని పాటించాలో చెప్పకపోవడంతో.. వారికీ స్పష్టత లేదు. పొత్తులపై కేంద్ర పార్టీ ఆదేశాలకు అనుగుణంగా వెళ్తామని.. చెబుతున్నారు. కానీ అక్కడ్నుంచి ఏ ఆదేశాలు రావడం లేదు. ఏపీలో బీజేపీకి కొన్ని పరిమితులు ఉన్నాయి. ప్రస్తుత అధికార పార్టీ వైసీపీ .. బీజేపీకి ఎంత మేర కావాలో అంత మేర సపోర్టుగా ఉంటోంది. ఏ విషయంలోనూ ఇబ్బంది పెట్టడం లేదు. కావాల్సినప్పుడల్లా సహకరిస్తోంది. ఇంతగా సహకరిస్తున్న పార్టీని దూరం చేసుకోవడం ఎందుకన్న అభిప్రాయంతో ఆ పార్టీ అగ్రనేతలు ఉన్నారన్న అభిప్రాయం ఉంది. అదే సమయంలో వైసీపీ సహకరించినా.. ఎట్టి పరిస్థితుల్లోనూ నేరుగా పొత్తులు పెట్టుకోదు. అదే మైనస్. బీజేపీ .. 2014 నాటి పొత్తులతో పోటీ చేస్తే ప్రయోజనం ఉంటుంది.

## ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ సన్నద్ధం



- ఈ నెల 15న బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదల!
- అభ్యర్థుల సమక్షంలో ఎన్నికల మేనిఫెస్టో
- అభ్యర్థులకు బీ ఫారాలను అందజేసే అవకాశం
- అన్ని వర్గాలను ఆకర్షించేలా పలు హామీలు ఉండే అవకాశం
- 15 నుంచి కేసీఆర్ జిల్లాల పర్యటన ప్రారంభం
- 16న జనగామ, భువనగిరిలో బహిరంగ సభలు
- 17న సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలో సభలు
- ప్రతిపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధించనున్న గులాబీ బాస్

హైదరాబాద్,అక్టోబర్9(( ): రాష్ట్రంలో ఎన్నికలు షెడ్యూల్ విడుదల అయినందున.. ప్రధాన రాజకీయ పార్టీలన్ని ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం అవుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఈ నెల 15న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశమవ్వనున్నారు. అనంతరం ఆ పార్టీ మేనిఫెస్టో ను విడుదల చేయనున్నారు. అదే రోజు బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ ఫారాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఇవ్వనున్నారు. నవంబర్ 9న కోనాయపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల అనంతరం.. గజ్వేల్, కామారెడ్డిలో కేసీఆర్ నామినేషన్ వేయనున్నారు. అనంతరం కామారెడ్డిలోని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో బీఆర్ఎస్ వేగం పెంచింది. ఇప్పటికే ఓ వైపు కేటీఆర్, హరీష్ రావు.. మరోవైపు అభ్యర్థులు రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా.. ఈనెల 15 నుంచి గులాబీ దళపతి రంగంలోకి దిగనున్నారు. ఈనెల 15న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులతో కేసీఆర్ సమావేశం కానున్నారు. అభ్యర్థులకు బీఫారాలు ఇవ్వడంతో పాటు.. పలు అంశాలపై దిశానిర్దేశం చేస్తారు. నామినేషన్లు వేసే సమయంలో జాగ్రత్తలు.. ఎన్నికల నియామళి, ప్రచార వ్యూహాలను అభ్యర్థులకు కేసీఆర్ వివరించనున్నారు. అదే సమయంలో అభ్యర్థుల సమక్షంలో ఎన్నికల మేనిఫెస్టోను కేసీఆర్ విడుదల చేయనున్నారు. ఆసరా ఫించన్లు, రైతుబంధు సాయం పెంపు వంటి రైతు, మహిళ, బీసీ, మైనారిటీలు, యువతను ఆకర్షిం చేలా పలు హామీలు ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో బీఆర్ఎస్ సభలను నిర్వహించనుంది. ఈ నెల 15 నుంచి కేసీఆర్ జిల్లాల పర్యటన ప్రారంభం కానుంది. 15న హుస్నాబాద్‌లో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. 16న జనగామ, భువనగిరిలో కేసీఆర్ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. 17న సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాలో, 18న మధ్యాహ్నం 2 గంటలకు జడ్చర్లలో.. సాయంత్రం 4 గంటలకు మేడ్చల్ బహిరంగ సభల్లో గులాబీ దళపతి ప్రచారం నిర్వహిస్తారు. రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఎన్నికల జరిగే తేదీలను ప్రకటిం చింది. నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ మొదలయి.. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు వరకు పూర్తి తేదీలను విడుదల చేసింది. దీంతో రాజకీయ పార్టీలన్ని ఎన్నికల ప్రచాం ం షెడ్యూల్ తయారు చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలను ఇచ్చింది. దీంతో పాటు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అధికారంలోకి వస్తే అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను త్వరలోనే విడుదల చేయనుంది. బీజేపీకూడాఈనెల15న తమ అభ్య ర్థుల ను ప్రకటించే పనిలో ఉంది.

## ఉత్తమ విద్య బోధన సేవలకు ఉత్తమ గౌరవ పురస్కారం

### ప్రతిభా హై స్కూల్ కు రెండు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

కౌతాళం,ఈనెల 5వ తేదీన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యం( అప్పుస్మా ) ఆధ్వర్యంలో 2023వ సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించడం జరిగింది. అందులో భాగంగా ఆదివారం కర్నూలు లోని మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో మంత్రాలయం నియోజక వర్గం పరిధి, లోని కౌతాళం ప్రతిభా ఇంగ్లీష్ మీడి యం హై స్కూల్ వారికి రెండు ఉత్తమ ఉపాధ్యాయుల ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అపుస్మ వ్యవస్థాపకులు, సలహాదారులు ,జనార్ధన్ రెడ్డి, పుల్లయ్య మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనది అని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత మనప్రస్తుతం సమాజంలో విద్యార్థులు మంచి అలవాట్లు క్రమశిక్షణ, నైతిక విలువలు,, కలిగి ఉండాలని ఆ దిశగా విద్యా బోధన అందించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా, సయ్యద్ మైనుద్దీన్ , ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి సీనియర్ ఉపాధ్యాయులు జయలక్ష్మి ,రామలక్ష్మి, ఉపాధ్యాయులు శిరీష, పరమేష్, ముంతాజ్, సునీల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కడుపునొప్పి తాళలేక 20 ఏళ్ల మహిళ ఆత్మహత్య



గోనెగండ్ల అక్టోబర్ 09:- వీభారె న్యూస్ ప్రతినిధి :-×గోనెగండ్ల మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో సుస్మిత (20) అనే మహిళ ఉరివేసుకుంది వేముగోడు కు చెందిన సుష్మితకు అదే గ్రామానికి చెందిన బోయ పెద్దయ్యకు మూడేళ్ల క్రితం వివాహమైంది. గత కొంతకాలంగా సుస్మితకు కడుపు నొప్పితో బాధపడుతుండేది. వైద్యం చేయించినప్పటికీ కూడా కడుపునొప్పి నయం కాకపోవడంతో అందరూ నిద్రిస్తున్న రాత్రి సమయంలో ఇంటి పై కప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ప్రభుత్వ భూములు భూకబ్జాలు స్పందన లో సిపిఐ వినతి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 09 :-నంద్యాల జిల్లాలో తిరుమలగిరి ఎస్టేట్. అగ్రసేని ఎస్టేట్ పేర్లతో రియల్ ఎస్టేట్ యజమాని బికే సింగ్ ప్రభుత్వ భూములను భూకబ్జాలు చేసి వెంచర్లు ద్వారా ప్రభుత్వ ఖజానాను గండి కొట్టే విధంగా ప్రయత్నిస్తున్నారని బికే సింగ్ అక్రమఆస్తులపై సమగ్ర విచారణ జరిపించాలని. అలాగే. ఆత్మకూరుఆర్డీవో మురియాందాస్ ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ప్రభుత్వ ఉద్యోగాలను లక్షల రూపాయలకు అమ్ముకుంటూ అవినీతికి పాల్పడూ తున్నాడని జిల్లా ఉన్నతా అధికారులతో ఎంక్వైరీ కమిటీ వేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలోని డిఆర్ఓ పుల్లయ్య కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఐజిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్. సిపిఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు. ఏ. ధనుంజయుడు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రభుత్వ భూములలో ఎర్రజెండాలు పాతి పేద ప్రజలకు అందజేస్తామని నాయకులు తెలిపారు.

# వైసీపీ ప్రతినిధుల సభకు పెద్దకడబూరు నుండి ఆరుగురికి ఆహ్వానం



పెద్దకడబూరు అక్టోబరు 09 ( విభారె న్యూస్)పెద్దకడబూరు మండల ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, పెద్దకడబూరు గ్రామ సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర నలమూలల నుండి వైఎస్ఆర్ సిపి నాయకులు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నేడు జరిగే వైసీపీ ప్రతినిధుల సమావేశానికి పెద్దకడబూరు మండలం నుండి ఆరుగురికి ఆహ్వానం వచ్చిందని అంటు ఎంతో సంతోషించారు పెద్దకడబూరు మండలం కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ఎంపీపీ శ్రీవిద్య, జడ్పీటీసీ జాము రాజేశ్వరి, ఇద్దరు వైస్ ఎంపీపీలు ఇర్ఫాన్ దేశాయ్, ముత్తమ్మ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ఛైర్మన్ భాగ్యమ్మ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, పెద్దకడబూరు గ్రామ సర్పంచ్ రామాంజనేయులుకు ఆహ్వానం లభించిందని వారు ఎంతో ఆనందించారు

# ఎమ్మెల్యేను అడ్డుకున్న మహిళలు

నిర్మల్,నిర్మల్ జిల్లా బాసర మండలం కిర్గుల్ (కె) గ్రామంలో రామాలయం భూమి పూజకు వెళ్లిన ఎమ్మెల్యే విట్టల్ రెడ్డిని దళిత బంధు అందరికి ఇవ్వాలని మహిళలు నిలదీసారు. దాంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. గ్రామ సర్పంచ్ దేవేందర్ , ఎమ్మెల్యే ముందే ఓ మహిళను కడుపులో తన్నిడంతో ఆమె కిందపడిపోయింది. మహిళకు గాయాలు కావడంతో ఆసుపత్రి కి తరలించారు.

# స్మశాన వాటికలో గుంతలు తీసే కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలి




కోసిగి, అక్టోబర్ 09(విభారె న్యూస్) మండలకేంద్రమైన కోసిగిలో సోమవారం రోజు డిహెచ్పిఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా చేశారు. అనంతరం స్పందనలో డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం ఎమ్మార్వో కు ఇచ్చారు ఈ కార్యక్రమానికి డి హెచ్ పి ఎస్ మండల అధ్యక్షుడు తిక్కయ్య అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి గోపాల్ మండల సహాయ కార్యదర్శి ఓంకార్ స్వామి ఏఐఎస్ఎఫ్ మంత్రాలయం తాలూకా అధ్యక్షుడు ఎస్. ఈరేష్ మాట్లాడుతూ కోసిగి మండలంలో ఎన్నో సంవత్సరాలుగా స్మశాన వాటికలో మట్టి గుంతలు తీసే కార్మికులు గ్రామాలలో మండలంలో అధిక సంఖ్యలో కార్మికుల ఉన్నారు వారిని రాష్ట్ర ప్రభుత్వం స్మశాన వాటికలో మట్టి గుంతలు తీసే కార్మికులకు వైయస్సార్ పెన్షన్ మంజూరు చేసి వారిని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు అలాగే డప్పు కళాకారులకు, చెప్పులు కొట్టే కార్మికులకు, చర్మగార కార్మికులకు, మత్స్యకార కార్మికులకు, ఒంటరి మహిళలకు, వితంతు మహిళలకు, వయసును కుదించి అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయాలని వారి డిమాండ్ చేశారు అనంతరం ఎమ్మార్వో స్పందిస్తూ వెంటనే కలెక్టరు దృష్టికి విషయం తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ మండల నాయకులు వరిషవ్వ, రాముు, ఎల్లవ్వ, కోనిగయ్యు, నరనయ్యు, ముకప్ప,ఈరన్న,తదితరుల పాల్గొన్నారు.

# ఎక్స్ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి: ఏఐవైఎఫ్




కోసిగి, అక్టోబర్ 09 (విభారె న్యూస్) ఎక్స్ప్రెస్ రైల్లో జనరల్ బోగీలు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా రైల్వే మేనేజర్లకు వినతి పత్రాలు సమర్పించడం జరుగుతుంది. అందులో భాగంగా ఈరోజు కోసిగి రైల్వే స్టేషన్ మేనేజర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తాలుక ప్రధాన కార్యదర్శి ఎం. రాజు మాట్లాడుతూదేశవ్యాప్తంగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు కోట్లాది మంది ప్రజలు రైళ్లలోనే ప్రయాణం చేస్తున్నారనీ, రైల్వే శాఖ కూడా ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తుందనీ, అయితే కరోనా కాలం నుండి రైల్వే వ్యవస్థలో చాలా మార్పులు జరిగాయని వారన్నారు. ముఖ్యంగా కరోనా కారణంగా ప్యాసింజర్ రైలు నిలిపివేయడం తర్వాత తిరిగి పున ప్రారంభం కావడం లేదని వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వెంటనే ప్యాసింజర్ రైళ్లను పున: ప్రారంభించాలని వారు అన్నారు. కేవలం ఎక్స్ప్రెస్ రైలు మాత్రమే తిరగడంతో వాటిలో ఎక్కువగా రిజర్వేషన్ బోగీలు ఉండటం వల్ల చాలా మంది సామాన్య ప్రజలకు రిజ్వేషన్ లో ప్రయాణించడం చేతకాక జనరల్ బోగీలలో ప్రయాణించాల్సి ఉందనీ వారు తెలిపారు. అయితే ప్రతి రైలుకు రెండు మాత్రమే జనరల్ బోగీలు ఉండటం వల్ల పేదప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. జనరల్ బోగీలలో ప్రజలు ఒకరిపై ఒకరు నిలుచుకొని ప్రయాణం చేస్తూ చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని కనుక జనరల్ బోగీలను పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన వందే భారత్ కొత్త కొత్త హంగులతో రూపొందించినప్పటికీ వాటి టికెట్ ధరలు మాత్రం విమాన స్థాయి ధరలు మాదిరిగా ఉన్నాయి అని, దాని వల్ల సామాన్య ప్రజలు ప్రయాణం చేయలేకపోతున్నారని కనుక వందే భారత్ రైల్ టికెట్లు ధరలు తగ్గించి సామాన్య ప్రజల దగ్గరకు రైలు బండిని చేర్చాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సంస్కరణల పేరుతో లాభాలు వస్తున్న రైల్వేను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందనీ, ప్రైవేటీకరణ చేస్తే ఉద్యోగాలు సంఖ్యలను తగ్గడం టికెట్ ధరలు పెరగడం జరిగే అవకాశం ఉందనీ, ప్రభుత్వ రంగ సంస్థగా రైల్వేను కొనసాగించాలని అఖిలభారత యువజన సమైక్య( ఏఐవైఎఫ్)గా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నరేష్, ఫణీంద్ర, విశ్వనాత్, వీరేష్, జీవన్ తదితులు పాల్గొన్నారు.

# పోలీసు స్పందనకు 135 ఫిర్యాదులు..

## జిల్లా ఎస్పీ. కె.రఘువీర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 09:-నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి 135 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ గారు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరవే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణవే పరిష్కారం చూపాలని ,స్పందన ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని ,స్పందన పిర్యదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని ఆదేశించారు. ఈ స్పందన ఫిర్యాదులలో ఎక్కువగా సివిల్ తగాదాలు,కుటుంబ కలహాలు,అన్నదమ్ముల ఆస్థి పంపకాలలో మనస్పర్ధలు మొదలగునవి ఉన్నాయి. ఫిర్యాదులలో కొన్ని .. నా రెండవ కుమారుడైన జి.ఖాజా హుస్సేన్ అతని భార్యా కరిమూన్ నన్ను నాభర్తను ఇల్లు వ్రాసివ్వాలని ధూసించూచు, కొట్టుచున్నారని చంపుతామని బెదిరిస్తున్నారని నాకు న్యాయం చెయ్యండని బనగానపల్లికి చెందిన జి.నజీమూన్నీసా జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేశారు.. ఫ్లాట్ల వ్యాపారం చేసుకుందాం అని అందు కొరకు 30 లక్షలు అవసరం అవుతాయని వాటిని తెస్తే అందరం కలిసి వ్యాపారం చేసుకోవచ్చు అని శిల్పనగర్ కు చెందిన శ్రీవల్లి మనోజ్ లు కలిసి నా వద్ద నుండి 30 లక్షలు తీసుకొని నాకు తెలియకుండా ఇళ్ల స్థలాలు కొని వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకొన్నారని ఎందుకు ఇలాగ చేశావు అని నా డబ్బులు నాకివ్వమని అడుగగా ఇవ్వను ఏవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని మళ్ళీ డబ్బులు అడిగితే చంపుతానని బెదిరిస్తున్నారని నాకు న్యాయం చేయండి అని పొన్నాపురం కు చెందిన ఎమ్ .వరదరాజు జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేశారు. .బండిఅత్మకూరు మండలం పరమటూరు గ్రామానికు చెందిన చిన్న స్వామి అనే రైతు పొలం సాగు చేసుకుంటుండగా సదరు భూమి పై తమకు హక్కు ఉంది అంటు కొందరు వ్యక్తులు పంటను ట్రాక్టర్ తో ధ్వంసం చేసినారని నాకు న్యాయం చేయండి అని జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేశాడు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకటరాముడు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జె.వి సంతోష్ పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్యలపై జనసేన పోరుబాట



కర్నూలు అక్టోబర్ 9 విభారె న్యూస్. నిరుద్యోగ సమస్యలపై జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాజ్ విహార్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఐటీ వింగ్ కోఆర్డినేటర్ లక్ష్మీకాంత్ రెడ్డి సాధనగిరి, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జి రేఖ మరియు పవన్ లు మీడియాతో మాట్లాడుతూ మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తానని పాదయాత్రలో మాట ఇచ్చినటువంటి ముఖ్యమంత్రి ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదని డీఎస్సీ అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు., ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలైనా గ్రూప్ వన్ గ్రూప్ టూ పోస్టులు భర్తీ చేయలేదని,ఎస్సై ఈవెంట్స్ నిర్వహించిన 20 రోజులకే మెయిన్స్ పరీక్షలు పెట్టడంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు చదువుకోడానికి కనీసం రెండు నెలల సమయం ఇవ్వాలని వారు కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని జిల్లా జనసేన పార్టీ ప్రధానంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాను కరువు జిల్లాలో ప్రకటించాలి: ఏంప్ర రైతు సంఘం డిమాండ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 09 :-నంద్యాలను కరువు జిల్లాగా ప్రకటించాలని జిల్లా కలెక్టర్ గారికి నంద్యాల జిల్లా రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ జి సోమన్న ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులుసోమవారం మెమోరాడం సమర్పించారు. 20 23వ సంవత్సరంలో వర్షాలు లేకపోవడం వలన సమయానికి కేసికి నీరు విడుదల చేయలేక ఆరు తడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం సూచించడం వలన వేసిన పంటలకు నీరు సరిగ్గా అందక తెగుళ్లతో అల్లాడుతూ పంటలు చేతికి వస్తాయా రావో అని ఆందోళన చెందుతున్నారని అన్నారు . రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావలసిన వ్యవసాయ పరికరాలు విత్తనాలు ఎరువులు పురుగు మందులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనుక తక్షణమే ప్రభుత్వము రైతుల భారం తగ్గించడానికి ఎకరాకు 50 వేల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# డిసెంబర్ ఆఖరి వరకు సాగునీరు విడుదల చేయాలని తహసీల్దార్ వీరేంద్ర గౌడ్ కు వినతిపత్రం అందజేశారు

## కరువు మండలంగా ప్రకటించాలని ధర్నా






పెద్దకడబూరు అక్టోబరు 09 ( విభారె న్యూస్) పెద్దకడుబూరు ను కరువు మండలంగా ప్రకటించాలని సోమవారం పెద్దకడబూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్, సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, నాయకులు హనుమంతు అలాగే ఎల్లెల్సీకి డిసెంబర్ ఆఖరి వరకు సాగునీరు విడుదల చేయాలని , తిక్కన్న మాట్లాడుతూ ఎల్లెల్సీ కింద సాగు చేసిన వరి పంట డిసెంబరులో రైతుల చేతికి అందుతుందని, అప్పటి వరకు సాగునీరు విడుదల చేయాలని, ఖరీఫ్ లో దెబ్బతిన్న పంటలను నష్టపరిహారం ఇవ్వాలని తహసీల్దార్ వీరేంద్ర గౌడ్ కు వినతిపత్రం అందజేస్తు భారీ నినాదాలు చేశారు. పెద్దకడబూరును కరువు మండలంగా ప్రకటించాలని, వర్షాభావ పరిస్థితుల వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు

# శ్రీశైల దేవస్థాన గో సంరక్షణ పథకానికి భక్తుల విరాళం.





శ్రీశైలం అక్టోబర్ 9 విభారె న్యూస్. శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి దేవాలయం లో గో సంరక్షణ పథకానికి గాను జె శ్రీనివాస విజయ గణపతి హైదరాబాద్ వాస్తవ్యులు రు. 1,00,116 లను, కే. ఉమామహేశ్వర రావు సికింద్రాబాద్ వాస్తవ్యులు రు. 1,00,116 లను పర్యవేక్షకులు ఎ. నాగరాజుకు అందజేయడం జరిగినది. వీరికి దేవాలయం వారు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి, శాలువాతో సత్కరించి, స్వామి అమ్మవార్ల లడ్డు ప్రసాదం అందజేసి, స్వామి అమ్మ వార్ల చిత్రపటాన్ని అందజేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190